తేది: **14.12.2015**

## ప్రాచీన తెలుగు భాషాసాహిత్యాల అవగాహన శిక్షణ శిబిరం



ప్రాచీన తెలుగు భాషా సాహిత్యాల అవగాహన సభను ద్రావిడ విశ్వవిద్యాలయంలో డిసెంబర్ **14**, **2015** న మొదలైంది. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ సభలో ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఇ. సత్యనారాయణ గారు విచ్చేశారు. తమ ప్రసంగంలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం వారు నిర్వహించిన మొట్టమొదటి కార్యక్రమాన్ని కార్యక్షేత్రంగా మా విశ్వవిద్యాలయాన్ని ఎంచుకోవటం ఎంతో సంతోషదాయకమని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం నిరంతరం ఇటువంటి నిర్మాణాత్మక కార్యక్రమాలతో ముందుకు సాగాలని కోరుకున్నారు. ప్రాచీన సాహిత్యాన్ని తమ వారసత్వ సంపదగా భావించే తరాన్ని తయారు చేయాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉన్నదని అభిలషించారు. ఈ సందర్భంగా ప్రధానోపన్యాసం చేసిన పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం సందర్శక ఆచార్యులు ఆర్వీయస్ సుందరం గారు మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యాల గొప్పతనాన్ని ఈ తరం తెలుసుకొని మరింత శక్తిమంతంగా తయారవ్వాలని కోరారు. నన్నయ నుంచి ఈనాటి తరం వరకు వున్న తెలుగు సాహిత్యం గొప్పతనాన్ని సంక్షిప్త సుందరంగా వివరించి, మిగిలిన సాహిత్యాలకంటే తెలుగు ఏ విధంగా శక్తిసంపన్నమో వివరించారు.




మదరాసు ప్రెసిడెన్సీ కళాశాల ఆచార్యులైన దేవుళ్ళ చిన్నికృష్ణయ్య గారు, ఆచార్య శలాక రఘునాథశర్మగారు, ఆచార్య ఎన్.యస్.రాజు గార్లు ఆశీ:ప్రసంగం చేశారు. ఇంకా ఈ సదస్సులో ఆచార్య కస్తూరి విశ్వనాథం గారు, ఆచార్య శ్రీనివాసాచార్యులుగారు తెలుగు ప్రాచీన ప్రతిపత్తి సాధించటంలో ఎదురైన సమస్యలను గురించి వివరించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంచాలకులు ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు గారు ఈ కార్యక్రమములో అధ్యాపకులు, అధ్యాపకేతరులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**వెల్చేరు నారాయణ రావు గారి ప్రసంగం:**

అమెరికాలోని ఎమొరో విశ్వవిద్యాలయంలో సందర్శక ఆచార్యులైన ఆచార్య వెల్చేరు నారాయణరావుగారు ప్రాచీన తెలుగు సాహిత్యం అవగాహన శిబిరాన్ని సందర్శించి తెలుగు పరిశోధనా విధానాన్ని, అందులో రావాల్సిన గుణాత్మకతని గురించి సమగ్రంగా విశ్లేషించారు. తెలుగు పరిశోధకులకు జబ్బు చేసిందా? అన్నట్లు నాసిరకపు పరిశోధనలు ఉత్పత్తి చేసే విశ్వవిద్యాలయాల ధోరణిని తప్పుపట్టారు. ప్రాచీన సాహిత్యంలో ప్రాచీనత అనేది కేవలం ఒక పార్శ్వం మాత్రమేనని అందులోని క్లాసిజాన్ని గుర్తించి దాన్ని తర్వాతి తరానికి అందించటానికి ఈనాటి తెలుగుశాఖలు విఫలమయ్యాయన్న బాధను వ్యక్తం చేశారు. ప్రాచీన సాహిత్యంలోని కథానిర్మాణ పద్ధతుల్ని, నిర్మాణ వ్యూహాల్ని, పదసంపదని ఏ మాత్రం తెలుసుకోకుండా విమర్శించేవాళ్ళు లేకపోలేదు. అటువంటి ధోరణిని మాని, అధ్యయనంతో అవగాహన పరిధిని విస్తృతం చేసుకోవాలని పేర్కొన్నారు.